# శ్రీ ఆండాళ్ వైభవం

(కావ్య నాయిక – గోదాదేవి)

డా. జి. అరుణ కుమారి

పల్లాండు పల్లాండు పల్లాయిరత్తాండు

పలకోడి నూరాయిరం

మల్లాండు తిన్‌తోళ్ మణివణ్ణాఉన్

సేవడి సెవ్వి తిరుకాప్పు

పల్లాండు పల్లాండు అని సాక్షాత్తు పరమాత్మ శౌర్య పరాక్రమాదులకు తిరుచరణారవిందాలకు రక్షగా మంగళశాసనం పలికిన మహా భాగవతోత్తముడు, పన్నెండు అళ్వారులలో ఒకరైన పెరియాళ్వారు అనేక సంవత్సరాలుగా అనేక మల్లులను జయించిన భుజాలు కలిగిన నీలవర్ణుడా నీ అందమైన ఎఱ్ఱని చరణాల సొగసుకు మంగళరక్ష అని భగశంతుడిని దీవించినందున ఇతడు పెద్ద ఆళ్వారయ్యాడు.

పెరియాళ్వారుకు కీర్తి కలిగించిన భగవత్సేవ మాలాకైంకర్యం. ఆ సేవకు ఫలితంగా శ్రీ ఆండాళ్‌కు పెంపుడు తండ్రిగా, శ్రీ మహావిష్ణువుకు మామగా నిలిచిన భాగ్యవంతుడు.

కలియుగంలో నామ సంకీర్తనతోనే భగవంతుని పొందగలమని నిరూపించడానికే భూదేవి అంశతో ఆండాళ్ అవతరించింది. ప్రజలలో అశాంతి కలిగి ధర్మగ్లాని కలిగినపుడు, వారిలోని భక్తిని పునరుద్ధరించడానికి భగవంతుడే తన సన్నిహితులను తన ప్రతినిధులుగా భూలోకానికి పంపి వారికి మార్గోపదేశం చేస్తాడు. దానికి ప్రత్యక్ష నిదర్శనం శ్రీవిల్లి పుత్తూరులోని విష్ణుచిత్తుడనే భక్తుని పూలవనంలో ఉదయించిన గోదా, పూమాలతోపాటు, పాశురాలనే కవితామాలలల్లి భగవంతునికి అర్పించి, ద్వాపరయుగం నాటి గోపికల వ్రత విధానాన్ని ఆచరించి, కలియుగంలో అందరి సమక్షంలో స్వామిలో ఐక్యమయ్యింది.

ఆండాళ్ రచించిన 'తిరుప్పావై' నేటికి భక్తుల పాలిట వేదం వంటిది. ఆమె రచించిన

'నాచ్చియారు తిరుమొళి' వైష్ణవ కల్యాణోత్సవంలో వేదమంత్రంలా ఉచ్చరింపబడుతుంది.

పూవు జీవితం స్వల్పమైనా దాని సుగంధం చాలాకాలం ఉంటుంది. అలాగే గోదాగా జన్మించిన ఆండాళ్ జీవిత ప్రమాణం స్వల్పమయినా ఆమె మధురభక్తి, భక్తితో స్వామినే వశపరచుకున్న విధానం కలకాలం భక్తుల హృదయాలలో ఆమెను చిరంజీవిగా చేసింది.

దక్షిణ భారతదేశంలో శ్రీవిల్లిపుత్తూరు క్షేత్రంలో వెలసిన స్వామి శ్రీ వటపత్రశాయి. విష్ణుచిత్తుడు నిత్యం మాలాకైంకర్యం చేస్తూ నిరాడంబర జీవనం గడుపుతూ జన్మ సార్థకం చేసుకున్న మహాభక్తుడు, సంసార జీవితాన్ని త్యజించి ఆశ్రమ జీవనం గడుపుతున్న భక్తునిపై దయకలిగి భూదేవి అంశలో ఒక పుత్రికను ప్రసాదించాడు పరంధాముడు.

### అవతారిక – నామకరణం

తులసి వనంలో చిన్న పూలమాలలా ఒక శిశువు ఉదయించింది. పూలమాల కట్టడం తప్ప అన్య మెరుగని ఆ మహా భక్తుడు ఆ శిశువుకు మాల అని పేరు పెట్టాడు. అచ్చ తమిళ భాషలో కోదై అని పిలచాడు. ఆ పదానికి అయోనిజ, జీవాత్మ అనే అర్థాలు కూడ చెప్పవచ్చు.

గోదా అనడంలో ఆమె భవిష్యత్తు కూడ గోచరిస్తుంది. తండ్రిగారి పూజ కోసం కోదై మాలలల్లడం, తాను ధరించి చూసి మురిసి పోయిన తరువాత స్వామికి అర్పించడం, తన భక్తితో స్వామి మెడనలంకరించి వాడని పూమాలగా శాశ్వతస్థానం సంపాదించడం ఇవన్నీ కోదై అన్న పేరులో స్ఫురిస్తుంది.

గోదా పూలవనంలో జనించటానికి మరొక కారణం చెప్పవచ్చు. స్త్రీలను పూలతో పోల్చటం కవిసమయం. సుగంధం, సౌకుమార్యం, కంటికింపైన వర్ణం, ఒక పొద్దు ఆయువును కలిగి భగవంతుని పాదాలను చేరి పునీతమవడం పూల లక్షణం. ఈ సుమలక్షణాలన్నిటిని గోదా కూడా పుణికి పుచ్చుకుంది. పూలవంటి సౌకుమార్యంతో సత్ప్రవర్తన సుగంధంతో అందరినీ ఆకర్షించి కౌమార ప్రాయంలో ప్రారంభంలోనే భగవంతునికి పూమాలతో బాటు, కవితామాల లల్లి పూవువంటి తన జీవితాన్ని సమర్పించిన

దివ్య కన్యకామణి కోదై. శ్రీరంగేశుని చేరే నాటికి ఆమె వయసు పదిహేను. తండ్రి ద్వారా శ్రీ విష్ణుమూర్తి దివ్యావతారాలను వింటూ ఎదిగిన గోదా తనకు తెలియకుండానే తన సర్వస్వాన్ని స్వామికి సమర్పించి తాను వేరు స్వామి వేరు అన్న భావాన్ని విడిచి, స్వామికి కట్టిన పూమాలను తాను ధరించి బాగా అమరిందని తృప్తిపడి, తరువాత స్వామికి సమర్పించింది. భగవంతుడెపుడూ భక్తుల దాసుడే. ఎలా పూజించినా, ఎలా భావించినా ఆయన కోరేది నిర్మల భక్తి మాత్రమే. కానీ తన భక్తుల గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి పరీక్షలు పెడుతూ వారి ఉనికిని అందరికీ చాటుతుంటాడు.

గోదా చేస్తున్న మాలాకైంకర్యాన్ని తండ్రి చూసి వేదన పడగా, భగవానుడు గోదా విడిచియిచ్చిన మాలనే తాను ధరిస్తానని అదే తనకు ప్రీతి అని చెప్పడం వలన తండ్రి తన కుమార్తె భక్తికి అనందించి ఆండాళ్ అని పిలిచేవాడు. ఆండాళ్ అంటే ఆట్ కొండాళ్ వశపరచుకున్నది అని అర్థం. తన భక్తితో భగవంతుడిని, ఇటు భక్తులందరినీ వశపరచుకున్నది ఆండాళ్. అంతేకాక 'శూడి కొడుత్త సుదర్ కొడి' అని ఆమెను దీపశిఖగా పవిత్ర భక్తురాలిగా ఆప్యాయంగా భక్తులు పిలుచుకున్నారు.

కుమార్తెకు ప్రాయం తొంగి చూడగానే తండ్రికి కలవరం కలుగుతుంది. ఈమెకు తగిన రూపగుణశీలవంతుడైన యోగ్యుడైన వరుని అన్వేషణ ఎలాగన్న ఆరాటం ఎక్కువయ్యింది. ఆండాళ్ యుక్తవయస్కురాలవుతున్న కొద్దీ తండ్రికి అదే ఆలోచన మొదలయ్యింది. కానీ కారణ జన్మురాలయిన కోదై మానవ వరులను వరించటానికి ఇష్టపడలేదు. సాక్షాత్తు శ్రీ మహావిష్ణువునే వరిస్తానని తండ్రికి చెప్పింది. కోదై జన్మ రహస్యం తెలిసిన విష్ణుచిత్తుడు కుమార్తె నిర్ణయాన్ని ఆశీర్వదించాడు. ఇక పరమాత్ముని అనంతకోటి రూపాలలో ఏ రూపంలో ఉన్న స్వామికి వరమాల వెయ్యాలని గోదా ఆలోచించింది. వైకుంఠవాసుడు భువిలో వెలసిన నూట ఎనిమిది దివ్య తిరుపతుల వైభవాన్ని వివరించమని తండ్రిని కోరింది. ఆ మహాభక్తుడికి అంతకన్నా కావలసింది ఏముంది.

తండ్రి వర్ణిస్తున్న దివ్యరూపాలు వింటు ఆండాళ్ తనువు, మనసు వివిధ రకాలయిన అనుభూతులకు లోనయ్యింది. మధురానగరిలోని గోపాలకృష్ణుని వర్ణనలు వింటూ శరీరం రోమాంచితమయ్యింది. ఏడు కొండల వేంకటపతి వైభవం వింటున్న ఆమె వదనం సూర్యకిరణం సోకిన కమలంలా విరిసింది. తిరుమాలిరుంజోలై స్వామి సౌందర్యాన్ని గురించి విన్న ఆండాళుకి ఆవ్యక్తమైన మానసికానందం కలిగింది. శ్రీరంగపురి నివాసుడైన రంగనాథుని దివ్యమంగళ స్వరూపాన్ని వింటూనే ఆండాళ్ యవ్వనం పరిపూర్ణంగా వికసించి ప్రేమభావానికి ఆమె అణువణువు పులకరించింది.

దక్షిణముఖుడై, విశాల వక్షంతో, చతుర్భుజాలతో, విశాల నయనాలతో పగడాన్ని ధిక్కరించే పెదవులతో ఆజానుబాహుడై పొడవైన దేహంతో శయనించి ఉన్న ఆ భంగిమ ఆమె మనసులో ముద్రించుకుపోయింది, ఆ స్వామినే తన వరునిగా నిశ్చయించుకుంది.

***మార్గశిరవ్రతం - పాశురమాల***

వరాన్వేషణ పూర్తయ్యింది. ఆ అపురూపమైన వరుణ్ణి ఎలా పొందాలి అనే ప్రశ్న తలెత్తింది. తపస్సా, ధ్యానమా, యోగమా, వ్రతమా ఏ మార్గంలో తన కోరికను సాధించుకోవాలి అని ఆలోచించి గోదా చిన్నతనం నుండి విన్న శ్రీమద్భాగవతాన్ని ఆశ్రయించింది. గోకులంలోని అమాయక గొల్లపడుచులు కాత్యాయనీదేవి వ్రతమాచరించి అనితర సాధ్యమైన భగవత్సాన్నిధ్య సారూప్య సామీప్యాలను పొంది తద్వారా దివ్య పథమైన మోక్షాన్ని సాధించారంటే వారి కృష్ణుడిగా యవ్వనంలో ఉన్న కృష్ణుడిని గోపాలకృష్ణుడిగా అతని లీలలను వర్ణిస్తుంది. ఒకే ఉపమానం రెండు చోట్ల వేర్వేరు అర్థాలలో వర్ణించింది. సింహాన్ని ఉపమానంగా చేసి 'యశోదై ఇళం సిగం' అని 'సీరియ సింగం' అని వర్ణిస్తుంది. యశోదాదేవి చేతులలో ఉన్నపుడు 'ఇళంసింగం' లేప్రాయపు సింహమని, నీలాదేవి శయన మందిరం నుండి బయటకు వచ్చినపుడు సీరియ సింగం అని గుహనుండి జూలు విదిలించి బయటకు వచ్చిన 'కొదమ సింహం' లా ఉన్నాడని వర్ణించింది.

సింహం పిల్లయినా, కొదమ సింహమైనా దాని దుడుకుతనం, గాంభీర్యం అందరికీ ఆనందాశ్చర్యభయాలను కలిగిస్తుంధి. అయితే మచ్చిక చేసుకుంటే కొదమసింహమైనా పిల్లికూన వంటిదే, కాబట్టి కృష్ణుడు ఎంత గొప్పవాడయినా మాకు భయంలేదు. ఎందుకంటే మాకు అతడు అర చేతిలోని మాణిక్యం అన్నది గోపికల ధీమా. ఈ విషయాన్ని ఆండాళ్ చిన్న మాటలలోనే చెప్పింది.

శ్రీ కృష్ణుని పరాక్రమాన్ని ఒక పాశురంలో వర్ణిస్తూ సామాన్యంగా చేసిన వర్ణనలో విశేష వర్ణన కనిపిస్తుంది. శ్రీకృష్ణుని దేవేరి అయినా నీలాదేవి దంతపు మంచంపై శయనించి ఉందట, అవి మామూలు దంతాలు కావు. తన నాయకుడైన శ్రీకృష్ణుడు జయించిన ఏనుగుల దంతాలతో చేసింది. కనుక ఆమెకు ప్రియుని శౌర్య పరాక్రమాలను అనుక్షణం గుర్తుకు తెచ్చేలా ... ఉంది. దానిపై శయనించడం ఆమెకు ఒక విధమైన గర్వాన్ని కలిగించిందట. అందుకే శయన మందిరం నుండి వెలుపలకు 'సిరియ సింగం'లా 'కొదమ సింహం' లా రమ్మని ఆండాళ్ ప్రార్థించింది. ఏనుగు సింహస్వప్నమంటేనే జడుసుకుంటుంది. ఏనుగు దంతాలతో చేసిన శయ్యపై పరుండి లేచిన కృష్ణుడు జూలు విదిలించిన సింహంలా ఉన్నాడనడం అతిశయోక్తి కాదు. 'నాచ్చియార్ తిరుమొళి' లోని పాశురాలన్నీ ఆండాళ్ విరహ వేదనకు సంబంధించిన భావనతో, అందులోనూ ఎక్కడా భక్తి కొరవడలేదు. తన సౌందర్యమంతా స్వామికే సొంతం కావాలని మానవ మాత్రులకు ఎంత మాత్రం ఆకర్షణీయం కాకుండా చూడమని మన్మథుని వేడుకుంది.

'వానిడై వాళుం అవ్వానవరుక్కు' (నాచ్చియార్ తిరుమొళి 1,5) పసిప్రాయం నుండి పరమాత్మనే తలచి తలచి పెరిగిన తన తనువును అతని గుణగానంలో పులకరించిన ఎత్తయిన స్తనాలను చూసి మానవులకు ఏ మాత్రం ఆశ కలగకుండా చూడమని, దేవతలకు కొనిపోయే పవిత్రమైన హవిస్సును అడవిలో తిరిగే నక్క ఆఘ్రాణించడం న్యాయమా అది అయిన పక్షంలో నా ప్రాణం పోతుంది సుమా అని మన్మథుని వేడుకుంది. ఆండాళ్ పుట్టినప్పటి నుండి విల్లిపుత్తూరులోని వటపత్రశాయిని సేవించి తాను విడిచిన మాలలర్పించి

కైంకర్యం చేసినా పెళ్ళి అనగానే శ్రీరంగనాథుడినే కోరుకుంది. చిన్నప్పటినుండి మాలాకైంకర్యం చేసిన వటపత్రశాయి కూడా శయన భంగిమలో సుందరమూర్తియే. కోదై కో అనగానే వచ్చి అనుగ్రహిస్తాడు. అయినా రంగనాథుడిని కోరుకుంది. ఈ విధంగా ఒకే మూర్తిని చాలా కాలంనుండి పూజించి ధ్యానించి ఆ మూర్తిలో ఐక్యమైనవారు ఎందరో ఉన్నారు. ఆండాళ్ తన భక్తి ప్రేమ అందరికీ తెలిసేలా స్వామి రావాలనే రంగనాథుడిని ఎంచుకుంది. వైష్ణవులకు శ్రీరంగం అనగానే ఎంతో గౌరవం, భక్తి, శ్రద్ధలు. పెరియకోవిల్ అని పెరుమాళ్ అని భక్తితో సేవిస్తారు. అటువంటి స్వామి స్వయంగా విల్లిపుత్తూరులోని ఆండాళ్‌తో తన కళ్యాణం జరిపించమని అర్చకులతో, రాజుతో చెప్పడం వలన ఆండాళ్ భక్తి ఎంతటిదో ప్రపంచానికి తెలిసింది. 'నాచ్చియార్ తిరుమొళి' ప్రబంధంలోని ఆండాళ్ స్వప్న వృత్తాంత వర్ణనను తెలియజేసే పాశురాలు ఎంతో గొప్పవి. నేటికీ వైష్ణవ వివాహ సంప్రదాయంలో వేదమంత్రంలా ఉచ్చరిస్తున్న ఘనత గలది. ఆండాళ్ పది పాశురాలలో తన కళ్యాణ వైభవాన్ని స్వప్నంలో తిలకించిన తీరును తన చెలికత్తెలకు వర్ణించడం ఎంతో అద్భుతంగా ఉంటుంది. వైష్ణవ సంప్రదాయానుసారం స్వామితో వివాహం జరిగినట్లు గోదాదేవి వివాహ వేడుకలను వివరించింది.

వేలాది మదగజాల మధ్య మృగరాజులా గంభీరంగా వివాహానికై తరలి వస్తున్న నారాయణమూర్తికి ఎదురేగి ఆహ్వానించడానికి పురవాసులంతా తోరణఆలతో బంగారు పూర్ణకలశాలతో వీధులన్నీ అంకరించారట. వివాహ ముహూర్తానికి ఒక్క ఒక్క రోజు ముందుగా వచ్చి పచ్చని ముంగిట ఇంద్రాది దేవతలను వెంటబెట్టుకుని వధువును నిశ్చయంచేసుకున్నాడట. నాలుగు చెరగులా పుణ్యతీర్థాలు సేకరించి మంగళస్నాన మాచరించి మధుపర్కాలు ధరించి కల్యాణమాలతో వధూవరులు బ్రాహ్మణ వేదఘోషల నడుమ కల్యాణ కంకణాలు ధరించారట.

కన్యలు ముత్తైదువలు కలశాలలో దీపాలు తీసుకుని వధూవరులకు ఎదురేగగా మంగళ వాయిద్యాల నడుమ శంఖనాదంతో ముత్యాల పందిరిలో మధుసూదనుడు పాణిగ్రహణం చేసాడట.

విప్రులు వేద పారాయణం చేయగా, మొలకెత్తిన ధాన్యాలను పాలతో చల్లగా మాధవుడు నా చేతిని పట్టి అగ్నిచుట్టూ ప్రదక్షిణ చేసాడట. ఇహపరసాధనకు ఏడేడు జన్మల బంధాలకు తోడుగా ఉంటానని నారాయణుడు ఏడడుగులు నడిపించి, సన్నికల్లుపై తన తామరవంటి చేతులతో నా పాదాలను ఉంచాడట.

వధూవరులు సోదరుని సహాయంతో లాజహోమం చేయడం చూసాను. వసంతాలు చల్లుతూ తిరువీధులలో మదగజంపై నా ప్రాణసుఖునితో ఊరేగడం, వసంతా లాడడం చూసాను.

తన స్వప్నంలో తిలకించిన వివాహ విశేషాలను వినిపిస్తూ ఆండాళ్ గోపాలునికై కన్న స్వప్న వృత్తాంతాన్ని పఠించిన వారికందరికీ సత్సంతానం ప్రాప్తిస్తుందని మంగళ వచనం పలికింది.

పెరియాళ్వారు పరంధామునకి మంగళశాసనం పాడి రక్షకల్పించగా మరి వారి పెంపకంలో గోదాదేవి అదే మార్గంలో స్వామికి దృష్టి తగల కుండా రక్షబెట్టి కాచుకున్నది.

గోదాదేవి విరహవేదనను, మతిభ్రమించినట్లు ఆమె ప్రవర్తనను స్వామి పరాన్ముఖత్వాన్ని చూసి తండ్రి పెరియాళ్వారు మనసు కలతపడింది. శరణన్న వారికి దిక్కు నీవే కదా. వారి రక్షణ భారం నీదే, నా పుత్రిక పరిస్థితిని చూసి కరుణించవా. నీ మనసు రాయేనా. నా కూతురు నీ పాద ధూళినైన తెచ్చి తనపై చల్లమని అంటుంది. ఆమె వేదన ఎలా తీర్చేది. (యశోద కృష్ణునికై భక్తుల పాదధూళి కోసం అన్వేషించినట్లుగా గోదాదేవి కృష్ణుని పాదధూళిని కోరుతుంది) అని విష్ణుచిత్తుని ప్రార్థనకు కరిగిన రంగనాథుడు శ్రీరంగంలోని ప్రధాన అర్చకులకు, పాండ్యరాజుకు స్వప్నంలో కనబడి పెరియాళ్వారు ప్రియ పుత్రికతో తన పరిణయం చెయ్యాలని శాసించడం, సకల సన్నాహాలలో ఆండాళ్ తరలివచ్చి స్వామిలో లీనమవ్వడం స్వామి స్వయంగా విష్ణుచిత్తుడు సముద్ర రాజుతో సమానమని అతనిని మామగా గౌరవించి, ఆయన కోరిక మేరకు విల్లిపుత్తూరుకు వస్తానని వాగ్దానం చేయడం గోదాదేవి జీవిత చరిత్రలో అంతిమ ఘట్టాలు.

ప్రపంచానికి తన భక్తురాలి మహిమను తెలియజేయాలని వివాహాలంకరణతో ఆండాళ్ సమేతుడై రంగనాథుడు ఫాల్గుణమాసంలో ఉత్తరా నక్షత్రంలో శ్రీ విల్లిపుత్తూరులో దర్శనమిచ్చాడు.

ఆండాళ్ చూపిన భక్తి మార్గం భక్తుల పాలిట కల్పతరువు. సులభమైన మధురమైన వర్ణనలతో తేనెలొలికే తమిళ భాషలో ఆండాళ్ రచించిన తిరుప్పావై పండిత పామర యోగ్యమైనది. మార్గశిరమాసం అనగానే తిరుప్పావైని అందరూ గానం చేసి తరించే నెలగా భావిస్తారు.

మార్గశిర మాసంలో తిరుపతి వంటి ప్రతి వైష్ణవ క్షేత్రంలోనూ తిరుప్పావైతోనే భగవంతునికి సుప్రభాత సేవ ప్రారంభమవుతుంది. పూమాలలతో కలిపి కవితామాలలల్లి పూమాలగా తాను భగవంతుని కంఠాన్నలంకరించి కవితా మాలలను భక్తులకు అర్పించిన మధుర భక్తురాలయిన ఆండాళ్ దివ్య చరణాలకు వందనం. తిరుప్పావై ప్రబంధానికి మంగళం.